మూలుగుతున్న యనమదుర్రు డ్రెయిన్

- డ్రెయిన్‌లో అనేక వ్యర్థాలు
- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఆక్వా పరిశ్రమలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం


డ్రెయిన్‌లోకి వ్యర్థాలను వదిలేందుకు యనమదుర్రు వద్ద పైపులైన్ ఏర్పాటు చేస్తున్న ఆక్వా పరిశ్రమ యాజమాన్యం (ఫైల్)


నాగిడిపాలెం వద్ద దుర్వాసన వస్తున్న యనమదుర్రు డ్రెయిన్‌లోనే స్నానాలు చేస్తున్న దృశ్యం (ఫైల్)

భీమవరం అర్బన్: ఒకప్పుడు జీవ నదిగా పేరుగాంచిన యనమదుర్రు డ్రెయిన్ కలుషిత నీటితో మూలుగుతుంది. డ్రెయిన్‌ను ఆనుకొని పుట్టగొడుగుల్లా ఆక్వా పరిశ్రమలు ఏర్పాటు చేయడంతో కలుషిత నీటితో దుర్వాసన వెదజల్లుతుంది. దీంతో యనమదుర్రు డ్రెయిన్ పరివాహకంలో ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలో యనమదుర్రు, దిరుసుమర్రు, దెయ్యాలతిప్ప, గొల్లవానితిప్ప, తోకతిప్ప, లోసరి, నాగిడిపాలెం, తదితర గ్రామాలు ఆనుకొని ప్రవహిస్తూ మొగల్తూరు మండలంలోని ఉప్పుటేరులో కలుస్తుంది. ఆయా గ్రామాల్లో సుమారు 30 వేల మంది జనాభా వరకు నివసిస్తున్నారు. గత నాలుగు దశాబ్దాల క్రితం యనమదుర్రు డ్రెయిన్‌లోని నీటిని తాగునీటి గానూ, ఇంటి వాడకానికి ఈ ప్రాంత ప్రజలు వాడేవారు. అంతే కాకుండా కొంతమంది పూర్వీకులు గోస్తనీ నదీ జలాలుగా ప్రత్యేక పూజలు నిర్వహించే వారమని చెబుతున్నారు. యనమదుర్రు డ్రెయిన్ దుర్గంధం వల్ల పరివాహక గ్రామస్తులు తరచూ అనారోగ్యానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఆక్వా పరిశ్రమలు

యనమదుర్రు డ్రెయిన్ ఎగువన రొయ్య తలకాయల ఫ్యాక్టరీలు, ఆక్వా పరిశ్రమల ద్వారా విడుదలైన రసాయనాలతో యనమదుర్రు డ్రెయిన్ కలుషితమైంది. ఇది చాలదన్నట్లు ఎగువన భీమవరం పట్టణంలోని చెత్త, చెదారం, సెప్టిక్ ట్యాంకులు, డ్రెయినేజీ నీటిని ఈ డ్రెయిన్‌లోనే విడుదల చేస్తున్నారు. దీంతో ఉప్పుటేరు ద్వారా పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల పలు డ్రెయిన్లు రసాయనాలతో కలుషితమైపోతున్నాయి. అంతేకాకుండా రోజుకొకటి పుట్టగొడుగుల్లా డ్రెయిన్ పరీవాహక ప్రాంతంలో ఆక్వా పరిశ్రమలు, రొయ్యల షెడ్లు ఏర్పాటు చేయడంతో వాటి నుంచి విడుదలయ్యే కలుషితనీరు డ్రెయిన్‌లోనే వదులుతున్నారు.

డ్రెయిన్ శుద్ధి ఎప్పుడో..!

2014–2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.100 కోట్లతో యనమదుర్రు డ్రెయిన్ ప్రక్షాళన చేస్తామని ప్రకటించినా ఆచరణకు నోచుకోలేదు. దీంతో ఈ ప్రాంత ప్రజలు మాత్రం ఆ మాటలేమీ నమ్మేలేమని ఖరాఖండీగా చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి యనమదుర్రు డ్రెయిన్‌లోకి కలుషిత నీటిని విడుదల చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పరీవాహక గ్రామస్తులు కోరుకుంటున్నారు.

పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు

వివిధ పరిశ్రమలకు చెందిన వారు యనమదుర్రు డ్రెయిన్ కలుషితమవుతున్న నీటిని వదులుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని యనమదుర్రు పరీవాహక గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది పరిశ్రమల లబ్ధికోసం వేలాది మంది జీవితాలు బలవ్వాలా అని ప్రశ్నిస్తున్నారు.

తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నాం

ఎస్.నెలబాలుడు, నాగిడిపాలెం గ్రామస్తుడు

డ్రెయిన్ నుంచి వెలువడే దుర్గంధం వల్ల తరచూ చిన్న పిల్లలు నుంచి వద్దుల వరకు అనారోగ్యానికి గురవుతున్నాం. అంతే కాకుండా దోమలు ప్రబలి రాత్రులు కంటి మీద కునుకు పట్టడం లేదు. చాలా మంది 50–60 ఏళ్ల మధ్య వృద్ధులు ఊపిరితిత్తుల వ్యాధులతో చనిపోతున్నారు. నెలకు వేలాది రూపాయలు ఆస్పత్రులకే ఖర్చు పెట్టాల్సి వస్తుంది.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ అధినేతను కలిసిన సుందరకుమార్


వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సుందరకుమార్, రాహుల్

భీమవరం: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసినట్లు దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్ శుక్రవారం తెలిపారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైఎస్ జగన్‌ను కలిసి ఎస్సీ వర్గీకరణ, దళితులు, నిరుద్యోగుల సమస్యలపై వివరించినట్లు చెప్పారు. వైఎస్ జగన్‌ను కలిసిన వారిలో గంటా రాహుల్ తదితరులున్నారు.

ఆకివీడు ఎంపీడీఓగా సుహాసిని


ఎంపీపీ కె.జయలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపీడీఓ డి.సుహాసిని

ఆకివీడు: స్థానిక మండలపరిషత్ అధికారిగా డి.సుహాసిని శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన కె.వాణీ లింగపాలెం మండలానికి బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ మర్యాదపూర్వకంగా జెడ్పీటీసీ సభ్యుడు వేగేశ్న వెంకట్రాజు(యండగండి శ్రీను), ఎంపీపీ కఠారి జయలక్ష్మి, కూటమి నాయకుల్ని కలిశారు. మండల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని సుహాసిని చెప్పారు.

బీఎస్ఎన్ఎల్ పరికరాలపై నిర్లక్ష్యం


ఆరుబయట నిర్లక్ష్యంగా వదిలేసిన బీఎస్ఎన్ఎల్ పరికరాలు

భీమవరం అర్బన్: మండలంలోని గొల్లవానితిప్ప గ్రామంలో విద్యుత్ ఉప కేంద్రం వద్ద ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ పరికరాలు సిబ్బంది నిర్లక్ష్యానికి గురయ్యాయి. దీంతో ఆ పరికరాలు వర్షానికి తడుస్తూ, ఎండకు ఎండుతూ ఉండటంతో వాటిని చూసిన గ్రామస్తులు ముక్కున వేలేసుకుంటున్నారు. అన్ని నెట్‌వర్క్‌లు టారిఫ్ ఛార్జీలు పెంచడంతో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌పై ప్రజలు భారీ ఆశలు పెట్టుకున్నారు. సిబ్బంది నిర్లక్ష్యంతో లక్షలాది రూపాయల పరికరాలు పాడవుతున్నాయని పలువురు బీఎస్ఎన్ఎల్ సిబ్బందిని ఆక్షేపణ చేస్తున్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని, గర్భిణులు విలువైన పోషక ఆహారాలు తీసుకోవాలని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ రంగారావు అన్నారు. భీమవరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో దాతల సహకారంతో శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారం అందించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ దాత అరేటీ రాణి ప్రకాష్‌ల సౌజన్యంతో 46 మంది గర్భిణులకు గుడ్లు, అరటి పండ్లు, బ్రెడ్లు అందించామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి అభినందనలు


కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మను సత్కరిస్తున్న డాక్టర్ జేఎస్ కుమార్

భీమవరం (ప్రకాశంచౌక్): కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను శుక్రవారం భీమవరంలోని గిఫ్ట్ ఫెర్టిలిటీ హాస్పిటల్ టెస్ట్ ట్యూబ్ బేబి సెంటర్ డాక్టర్ జేఎస్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. ప్రజా ప్రతినిధిగా ప్రజలకు సేవలు అందించాలని, అందరి మన్నలను పొందాలని అన్నారు.

విష్ణు స్కూల్‌లో ఇస్రో అంతరిక్ష వారోత్సవాలు

భీమవరం: విష్ణు ఎడ్యుకేషన్ సొసైటీ స్కూల్‌లో ఈ నెల 5 నుంచి మూడు రోజుల పాటు సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ సహకారంతో ఇస్రో అంతరిక్ష వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు స్కూల్స్ ప్రిన్సిపల్ ఎల్.బిందు శుక్రవారం తెలిపారు. ఎస్‌డీఎస్‌సీ ప్రతినిధి బృంద ఆధ్వర్యంలో నిర్వహించే ఉత్సవాల్లో అంతరిక్షం–వాతావరణ మార్పు అనే అంశాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. 5వ తేదీన నిర్వహించే స్పేస్ వాక్ కార్యక్రమానికి ఎస్పీ అద్నాన్ నయీమ్‌అస్మి ముఖ్య అతిథిగా పాల్గొంటారని 6వ తేదీ కార్యక్రమంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొని విద్యార్థులకు స్పేస్ క్విజ్, చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహిస్తారన్నారు. 7వ తేదీన నిర్వహించే ముగింపు కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి, ఎస్‌డీఎస్‌సీ సీజీఎం ఎం.ప్రసాద్ పాల్గొంటారని బిందు తెలిపారు.

సేవా పురస్కారాలకు నలుగురి ఎంపిక

భీమవరం: అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని సర్వోదయ మండలి ఆధ్వర్యంలోఏ మానవత సమాజ సేవలందిస్తున్న నలుగురిని సర్వోదయ సేవా పురస్కారాలకు ఎంపిక చేసినట్లు సర్వోదయ మండలి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5వ తేదిన పట్టణంలోని గాంధీకస్తూరిబా భవనంలో చేకూరి జాన్సీ, డాక్టర్ కేవీ సుబ్బరాజు, కలిగొట్ల గోపాలశర్మ, ఏవీ నర్సింహరాజులకు సేవా పురస్కారాలు అందిస్తామని ప్రసాదరాజు తెలిపారు.

ఎస్ఆర్‌కేఆర్‌లో డిజిటల్ స్టార్టప్ ప్రారంభం


ఎస్ఆర్‌కేఆర్‌లో డిజిటల్ స్టార్టప్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

భీమవరం: ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ డిజైన్ ఫైనల్ ఇయర్ ఇంజనీరింగ్ విద్యార్థులు ఆధ్వర్యంలో రూపొందించిన భీమవరం డిజిటల్ స్టార్టప్‌ను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత్‌వర్మ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిషాంత్‌వర్మ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు ఎం.పృథ్వీవర్మ, కె.సంజు, సాహెచ్ రవికుమార్ భీమవరం డిజిటల్ స్టార్టప్‌ను ప్రారంభించడం అభినందనీయమన్నారు. దీని ద్వారా వెబ్‌సైట్ డెవలప్‌మెంట్, యాప్ డెవలప్‌మెంట్, సోషల్ మీడియా మార్కెటింగ్, కంటెంట్ రైటింగ్, డిజిటల్ కంటెంట్ క్రియేషన్ వంటి సేవలను అందించనున్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపల్ కేవీ మురళీకృష్ణంరాజు, టెక్నాలజీ సెంటర్ హెడ్ ఎస్.గోపాలకృష్ణమూర్తి, సీఎస్‌డీ విభాగం హెడ్ ఎం.సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ధరల అదుపులో ప్రభుత్వం విఫలం


భీమవరం డైలీమార్కెట్‌లో కూరగాయల ధరలు తెలుసుకుంటున్న సీపీఐ నాయకులు

భీమవరం: కూరగాయధరలను అదుపు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఐ పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు విమర్శించారు. శుక్రవారం పార్టీ నాయకులు పట్టణంలోని డైలీ మార్కెట్‌లో కూరగాయల ధరలను పరిశీలించారు. అనంతరం రంగారావు మాట్లాడుతూ అడ్డూ అదుపు లేకుండా రోజురోజుకు పెరుగుతున్న కూరగాయల ధరలతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశనంటుతుంటే ప్రజాజీవనం దుర్భరంగా మారిందని, 100 రోజుల్లో ధరలు తగ్గిస్తామన్న ప్రధానమంత్రి నరేంద్రమోడీ పదేళ్ల గడిచిపోతున్నా ధరలను పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి నాయకులు మామిడిశెట్టి లక్ష్మీపతి, వైవీ ఆనంద్, న్యూటన్, పాలా త్రిమూర్తులు, తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి తపాలాశాఖ వేడుకలు


భీమవరం హెడ్‌పోస్టాఫీసులో పోస్టర్ ఆవిష్కరణ దృశ్యం

భీమవరం: ప్రభుత్వ శాఖల్లో తపాలాశాఖ చాలా కీలకమైందని, పోస్టల్ శాఖలో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలున్నాయని భీమవరం హెడ్ పోస్ట్ మాస్టర్ పాలమూరి రాజు అన్నారు. శుక్రవారం భీమవరం హెడ్ పోస్ట్ ఆఫీసులో తపాలాశాఖ, శ్రీ విజ్ఞాన వేదిక అధ్వర్యంలో ప్రపంచ తపాలశాఖ దినోత్సవ వేడుకల బ్రోచర్స్‌ను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పోస్టల్‌శాఖ అక్టోబరు 9న స్థాపించిబడిన నేపథ్యంలో 9 నుంచి 16 వరకు వారోత్సవాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. వేడుకల్లో విద్యార్థులకు పోటీలు, స్టాంపులు, నాణేల ప్రదర్శన, 16న ఉత్తమ పోస్టల్ అధికారులకు సత్కారాలుంటాయన్నారు. కార్యక్రమంలో పీఆర్వో సత్యనారాయణ, సూపర్‌వైజర్ సీహెచ్ లెలిన్, చెరుకువాడ రంగసాయి, అరసవల్లి సుబ్రమణ్యం, భట్టిప్రోలు శ్రీనివాసరావు, ఎస్‌కే చాన్‌భాషా, పెండ్యాల సరిత, తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

వీరవాసరం: యూకేఎస్‌సీ, హృదయ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా ఈ నెల 6వ తేదీన (ఆదివారం) వీరవాసరం మండలం పెర్కిపాలెంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జక్కంపూడి మదన్, వేరుకొండ దుర్గా ప్రసాద్ తెలిపారు. క్లబ్ సభ్యులు, షిర్డీ సాయి మోడరన్ రైస్‌మిల్ అధినేతలు జక్కంపూడి వెంకట రంగారావు, నూకల ధనుంజయ్ సహకారంతో ఈ శిబిరం పెర్కిపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో నిర్వహిస్తామన్నారు. ఈ శిబిరంలో విజయవాడ మణిపాల్ హాస్పిటల్ వైద్యులచే మహిళలకు ఉచిత కాన్సర్ వైద్య శిబిరం, లయన్స్ కంటి ఆసుపత్రి పాలకొల్లు వారిచే ఉచిత కంటి వైద్య పరీక్షలు, విష్ణు డెంటల్ కళాశాల భీమవరం వారిచే ఉచిత దంత వైద్య సేవలు, పాలకొల్లు సిద్ధి హాస్పిటల్ వైద్యులు డాక్టర్ జక్కంపూడి సుభాషిణి ఉచిత చర్మ వ్యాధి వైద్య పరీక్షలు, పాలకొల్లు విజయ లాబ్ వారిచే బీపీ, షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారన్నారు. మరిన్ని వివరాలకు జక్కంపూడి మదన్ 89781 22234 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఎలుకల మందు పంపిణీ

పెనుమంట్ర: మండలంలోని 18 గ్రామాల్లో శుక్రవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం బ్రోమోడయోలిన్ కలిపిన ఎలుకల మందును రైతులకు పంపిణీ చేశారు. మండలంలో 61 కిలోల మందును నూకల ఎరలో కలిపి 10 గ్రాములు చొప్పున పొట్లాలుగా కట్టి రైతులకు అందించారు. ఈ మందును రైతులంతా ఒకేసారి బొరియల్లో పెట్టాలని మండల వ్యవసాయ అధికారి జోషిల సూచించారు. ఆయా కార్యక్రమాల్లో మార్టేరు ఏడీఏ హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆచంటలో..

పెనుగొండ: ఆచంట మండలంలో శుక్రవారం పెనుమంచిలి, శేషమ్మచెరువు, కోడేరుల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రాలు, సచివాలయాలు, రైతుసంఘాలు సంయుక్తంగా చేపట్టిన సామూహిక ఎలుక నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఎలుకల మందు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ అడ్డాల పార్వతి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


క్రీడాపోటీల్లో విజేతలుగా నిలిచి సత్కారం అందుకున్న న్యాయవాదులు

భీమవరం: కోర్టుల్లో కేసులతో అలసటకు గురయ్యే న్యాయవాదులకు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శారీరక ఆరోగ్యానిస్తాయని భీమవరం పోక్సో కోర్టు జడ్జి ఎం.సోమశేఖర్ అన్నారు. గత నెల 28, 29 తేదీల్లో రాజమహేంద్రవరంలో జరిగిన ఏపీ స్టేట్ లెవెల్ అడ్వకేట్స్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో భీమవరం న్యాయవాదులు పమ్మి రాధా కిరణ్మయి, బోకూరి సునీత ఉమెన్స్ డబుల్స్ విభాగంలో విన్నర్స్‌గా నిలవగా మట్టా చంద్రశేఖర వంశీ, రాధా మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో రన్నర్స్‌గాను పోటీల్లో పాల్గొన్న తరుణ్ ప్రతిభ కనబర్చిన సందర్భంగా శుక్రవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోక్సో కోర్టు ఆవరణలో నిర్వహించిన అభినందన సత్కార సభలో ఆయన మాట్లాడారు. సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి అప్పలస్వామి, జూనియర్ డివిజన్ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సురేష్ బాబు, జూనియర్ డివిజన్ రెండో అదనపు సివిల్ జడ్జి ధన రాజు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏలేటి న్యూటన్, అడపాల ప్రసన్నకుమార్, కోశాధికారి పరాలరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

చరిత్రను గమనిస్తే తెలుగు భాషా సాహిత్యం తెలుస్తుంది


సహస్రావధానులకు సన్మానం చేస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: తరతరాల తెలుగు చరిత్రను గమనిస్తే తెలుగు భాషా సాహిత్యాల పరిణామక్రమం అర్థమవుతుందని గురు సహస్రవదాని డా కడిమిళ్ల వరప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక క్షత్రియ కల్యాణ మండపంలో క్షత్రియ సంక్షేమ పరిషత్ మరియు రసధుని సంయుక్త నిర్వహణలో తెలుగు విజయం సాహిత్య రూపక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సహస్రావదాని వరప్రసాద్ మాట్లాడుతూ పురాణేతిహాసాల్లో ప్రాచీన సాహిత్యం, వర్ణన, శిల్పం, శృంగార రసం అంశాలకు ప్రబంధ సాహిత్యం, దైవభక్తికి వాగ్గేయకార సాహిత్యం, నీతి, ధర్మ, భక్తి ప్రభావాలకు శతక సాహిత్యం, ఏకాగ్రత, ధార, ధారణల వంటి ప్రతిభాపాందిత్యానికి అవధాన సాహిత్యం, సమకాలీన సామాజిక స్పృహతో నడిచే నాటక, గేయ, వచన, విప్లవ కవిత్వాల సమాహారం ఆధునిక సాహిత్యమని అన్నారు. తెలుగు సాహిత్య సమగ్రతపై నేటి యువతరానికి తెలియజెప్పే విశ్వరూప దర్శనమే తెలుగు విజయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సినీ గేయ రచయిత చేగొండి అనంతశ్రీరామ్, శతావధాని, భీమడోలు డా బలుసు అపర్ణ, విశ్రాంత హెచ్ఎం సీవీవీ సత్యనారాయణమూర్తి, శతావధాని, అబ్బిరెడ్డి పేరయ్యనాయుడు, చక్కావధానుల రెడ్డప్ప ధవేజి, రసధుని అధ్యక్షుడు కొట్టి భాస్కరరావు, జె.జయదుర్గారావు పాల్గొన్నారు.

బాలా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు


భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీ బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో మావుళ్లమ్మ


భీమవరం అర్బన్: దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం


ఆకివీడు: గాంధీనగర్‌లో గాయత్రీ అలంకరణలో అమ్మవారిని పూజిస్తున్న భక్తులు

భీమవరం (ప్రకాశం చౌక్): పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మ అమ్మవారు నవరాత్రి మహోత్సవాల్లో రెండో రోజు శుక్రవారం శ్రీ బాలా త్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శిమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లిఖార్జునశర్మ అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిషనర్ మహలక్ష్మీ నగేష్ పాల్గొన్నారు.

భీమేశ్వరస్వామి వారి ఆలయంలో:

భీమేశ్వరస్వామి వారి ఆలయంలో వేంచేసియున్న శ్రీమహిషాసురమర్దనీ అమ్మవారికి దేవీ నవరాత్రుల మహోత్సవాల్లో శుక్రవారం శ్రీబాలా త్రిపుర సుందరీదేవి అలంకరణ నిర్వహించారు. ఆలయ ఈవో తోట శ్రీనివాస్, అర్చకులు పాల్గొన్నారు.

నాచువారి సెంటర్‌లో

నాచువారి సెంటర్‌లోని శ్రీకనకదుర్గమ్మకు దేవీ నవరాత్రి మహోత్సవాలను ఒంటెద్దు బళ్ల సంఘం వారు ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారికి శుక్రవారం శ్రీలలితాదేవి అలంకరణ నిర్వహించారు.

దుర్గాలక్ష్మీ ఆలయంలో ప్రత్యేక పూజలు

పట్టణంలో గొల్లవాని తిప్ప రోడ్డులో వేంచేసియున్న శ్రీదుర్గాలక్ష్మీ ఆలయంలో దేవీనవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. భక్తులకు మాజీ చైర్మన్ పెనుమత్స రమేష్‌రాజు అన్నదాన ప్రసాదం ఏర్పాటు చేశారు. అలాగే గునుపూడి ఆదిలక్ష్మీ అమ్మవారికి శుక్రవారం బాలాత్రిపురసుందరీదేవి అలంకరణ నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో గొట్టుముక్కల నాగసీతారామరాజు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. మావుళ్లమ్మ అమ్మవారిని ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘు రామ కృష్ణరాజు దర్శించుకున్నారు. అలాగే మాజీ ఎమ్మెల్సీ మేక శేషుబాబు మావుళ్లమ్మను దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.


ఉండి: గాయత్రీదేవిగా పూజలందుకుంటున్న దుర్గమ్మ

గాయత్రీ మాతగా కనకదుర్గమ్మ

భీమవరం అర్బన్: మండలంలోని యనమదుర్రులో కొలువైయున్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారు దసరా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గాయత్రిమాత అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా అర్చకులు కనకదుర్గమ్మకు పసుపు కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న అమ్మవార్ల అలంకరణ

ఆకివీడు: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు గాయత్రీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయల్లో ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమ పూజలు, హోమాలు నిర్వహించారు. స్థానిక రాజరాజేశ్వరి సహిత మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని బాలలు, మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్యదర్శి కాకర్ల రాజరాజేశ్వరి మాట్లాడుతూ గాయత్రీ మంత్రం జపిస్తే 24 మంది దేవుళ్లను పూజించినట్లేనని చెప్పారు. ఆ పెద్దింటి అమ్మవారి ఆలయంలో సామూహిక కుంకుమపూజలు నిర్వహించారు. గాంధీనగర్‌లో గాయిత్రీ అమ్మవారిని దర్శించుకున్నారు.

ఉండిలో..

ఉండి: దసరా మహోత్సవాల్లో భాగంగా రెండవ రోజు శుక్రవారం కనకదుర్గమ్మ అమ్మవారు భక్తులకు గాయత్రీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా కలశస్థాపన, విశేషఅర్చనలతో పాటు సహస్ర కుంకుమార్చన పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మండలంలోని 19 గ్రామాల్లోను ప్రాంతాలవారీగా అమ్మవారి విగ్రహాలను ప్రతిష్టించి పూజలు చేస్తున్నారు.

నేటి నుంచి మాలధారులకు ఉచిత భోజనం

ఆకివీడు: మండలంలోని కుప్పనపూడి గ్రామంలో మాలధారులకు ఉచిత అల్పాహారం, భోజనం(భిక్ష)ను గ్రామంలోని ముత్యాల మాణిక్యం, రమాకాంతం కమ్యూనిటీ హాలులో ఈ నెల 5వ తేదీ నుండి ఏర్పాటు చేసినట్లు గురుస్వామి నూకల రామదాసు శుక్రవారం విలేకర్లకు తెలిపారు. అయ్యప్ప స్వాములు, భవానీలు, శివ మాలధారులు, వేంకటేశ్వరస్వామి మాలధారులకు డిసెంబర్ 20 వరకూ ఈ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

స్వర్ణాంధ్ర-2047పై సమీక్ష

భీమవరం(ప్రకాశం చౌక్): స్వర్ణాంధ్ర–2047లో భాగంగా జిల్లాలోని అన్ని అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా మెరుగైన అభివృద్ధికి సమగ్ర ప్రణాళికను రూపొందించాలని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. స్థానిక వశిష్ట సమావేశ మందిరంలో జిల్లా విజన్ ప్లాన్ 2024–2029 రూపొందించుటకు సలహాలు, సూచనలకు ప్రజా ప్రతినిధులు, అధికారులు, పారిశ్రామికవేత్తలతో ఏర్పాటు చేసిన సమావేశానికి మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని సమీక్షించారు.